

బెళగావి- భద్రాచలం రోడ్డు రైలు సేవల పొడిగింపు



బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని బెళగావి నుండి భద్రాచలం రోడ్ స్టేషన్‌ల మధ్య సంచరించే స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను ఈ నెల 30 నుండి ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తున్నట్లు నైరుతి రైల్వే నగరంలో గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. అదే విధంగా భద్రాచలం రోడ్ స్టేషన్ నుండి బెళగావికి ఈప్రత్యేక రైలు సేవలు మే 31 వరకు కొనసాగనున్నాయి. ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

17 మందితో కాంగ్రెస్ రెండో జాబితా

● 24 స్థానాలకు అభ్యర్థుల ఖరారు ● క్లిష్టంగా మారిన నాలుగు స్థానాలు ● వారసుల కోసం నేతల ఆరాటం

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ 17 మంది అభ్యర్థులతో రెండో జాబితా గురువారం రాత్రి ఢిల్లీలో విడుదల చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ జాబితాను విడుదల చేశారు. తొలి జాబితాలో ఇప్పటికే ఏడుగురిని ప్రకటించిన సంగతి తెలిసిందే. మిగిలిన 4 స్థానాలకు అభ్యర్థులకు త్వరలో ఖరారు చేస్తామని ఆయన మీడియాకు తెలిపారు. అయితే మిగిలిన నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేయడం అధిష్టానానికి తలనొప్పిగా మారింది. త్వరలో అవి కూడా ఖరారు చేస్తామని నేతలు వెల్లడిస్తున్నారు.



సీఎం సిద్ధరామయ్యతో భేటీ అయిన బెళగావి అభ్యర్థి మృణాళ్, మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్

రెండు పార్టీల్లోనూ టిక్కెట్ల గోలే..

లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు వెలువడిన తర్వాత కూడా కాంగ్రెస్, బీజేపీలు అభ్యర్థులను ఎంపిక చేసే విషయంలో మల్లగుల్లాలు పడుతున్నాయి. ఇరుపార్టీల ముఖ్యనేతలు రెండుమూడు రోజులుగా ఢిల్లీలోనే గడిపినా కాంగ్రెస్‌లో నాలుగు స్థానాలకు, కమలదళంలో ఐదు స్థానాలకు టికెట్లు ఖరారు చేయడం ఇరు పార్టీలకు తలనొప్పిగా మారింది. అధికార కాంగ్రెస్ పార్టీ తొలివిడతలో ఏడు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయగా మిగిలిన 21 స్థానాలకు కసరత్తు సాగుతోంది. ఇందులో 17స్థానాలకు అభ్యర్థులను తేల్చారు. చామరాజనగర్ రిజర్వు స్థానం నుంచి మంత్రి మహదేవప్ప కుమారుడు సునిల్‌బోస్ పేరు ప్రకటించాలని అనుకుంటున్నా ఒకే కుటుంబానికే ప్రాధాన్యం ఇస్తే మేం పార్టీలో గుర్తింపు ఇవ్వరా అంటూ మాజీ ఎమ్మెల్యే నంజుండస్వామి అభ్యంతరం తెలుపడంతో వాయిదా పడింది. చిక్కబళ్ళాపుర నుంచి వీరప్పమొయిలీ టికెట్ కోసం ప్రయత్నించినా సాధ్యం కాదని వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. రక్షా రామయ్య పేరు ఖరారు చేసే వేళ అనూహ్యంగా గౌరిబిదనూరు మాజీ ఎమ్మెల్యే శివశంకర్‌రెడ్డి తెరపైకి రావడంతో ఆ స్థానంలోనూ ఎంపిక సందిగ్ధమైంది. ఇవే కీలకం కాగా కోలార్ నుంచి మంత్రి మునియప్పకు కానీ వారి కుటుంబీకుల్లో ఎవరికీ టికెట్ ఇవ్వరాదంటూ ఉన్నత విద్యాశాఖా మంత్రి సుధాకర్‌తో పాటు సీనియర్‌నేత రమేష్‌కుమార్‌ల వర్గీయులు పట్టుబట్టడంతో ఎటూ తేల్చలేక పోతున్నట్లు తెలుస్తోంది. మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ ఎల్ హనుమంతయ్యకు ప్రతిపాదించినట్లు సమాచారం.

కమలంలో ఐదు స్థానాలకు సంక్లిష్టం...

కమలదళం తొలివిడత జాబితాలో ఏకంగా 20 స్థానాలకు టికెట్‌లను ఖరారు చేసింది. పొత్తులో భాగంగా మండ్య, హాసన్, కోలార్ స్థానాలు కేటాయించారు. ఇక మిగిలిన ఐదు స్థానాలకు ఎంపిక చేయడమే తీవ్రమైన సమస్యగా మారుతోంది. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు విజయేంద్ర, సీనియర్‌నేత యడియూరప్ప, ప్రతిపక్షనేత అశోక్‌లు ఢిల్లీలో మకాం వేసి అగ్రనేతలు జేపీనడ్డా, అమిత్‌షాలతో చర్చలు జరిపి దాదాపు కొలిక్కి తెచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాబితాను పరిశీలించాల్సి ఉండగా పెండింగ్‌లో పడింది. బీజేపీకి సంబంధించి పెండింగ్‌లో ఉండే ఉత్తరకన్నడ ఎంపీ అనంతకుమార్‌హెగ్డేకు టికెట్ లేదనేది తేలిపోయింది. ఇదే స్థానం నుంచి మాజీ స్పీకర్ విశ్వేశ్వర హెగ్డే కాగేరి పేరు పరిశీలనలో ఉండగా తాజాగా సీనియర్ నేత కుమారబంగారప్ప పేరు తెరపైకి వచ్చింది. బెళగావి సిట్టింగ్ ఎంపీ మంగళా అంగడికి కాకుండా ఆమె వియ్యంకుడు జగదీష్‌శెట్టర్‌కు ఇవ్వదలచారు. స్థానిక కార్యకర్తల అభ్యంతరంతో వాయిదా పడుతూ వస్తోంది. చిక్కబళ్ళాపుర నుంచి మాజీ మంత్రి సుధాకర్ పేరు ముందంజలో ఉండగా దాదాపు నెలరోజులుగా టికెట్ దక్కుతుందని పనిచేసిన యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ కుమారుడు అలోక్ విశ్వనాథ్ తీవ్రంగా అడ్డుతగులుతున్నారు. చిత్రదుర్గ సిట్టింగ్ ఎంపీ కేంద్రమంత్రి నారాయణస్వామి పోటీ చేసేది లేదని కొన్నినెలల కిందటే ప్రకటించారు. ఇటీవల ప్రయత్నాలు జరిపినా అధిష్టానం పెద్దలు తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఇక్కడి నుంచి సీనియర్‌నేత గోవిందకారజోళకు అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. ఇక రాయచూరులో రాజా అమరేశ్వరనాయక్, బీవీ నాయక్‌ల మధ్యన తీవ్ర పోటీ నెలకొంది.

లోక్‌సభ స్థానం	అభ్యర్థి పేరు
చిక్కోడి	ప్రియాంక జార్కిహోళి
బెళగావి	మృణాళ్ రవీంద్ర హెబ్బాళ్కర్
భాగల్కోటె	సంయుక్త ఎస్.పాటిల్
కలబురిగి ఎస్సీ	రాధాకృష్ణ
రాయచూరు ఎస్టీ	జి. కుమార్ నాయక్
బీదర్	సాగర్ ఖండ్రే
కొప్పళ	కె. రాజశేఖర్ బసవరాజ్ హిత్నాళ్
ధార్వాడ	వినోద్ అసూటి
ఉత్తర కన్నడ	డా. అంజలీ నింబాళ్కర్
దావణగెరె	ప్రభా మల్లికార్జున్
ఉడిపి-చిక్కమగళూరు	డా. జయప్రకాశ్ హెగ్డే
దక్షిణ కన్నడ	పద్మరాజ్
చిత్రదుర్గ ఎస్సీ	బీఎన్ చంద్రప్ప
మైసూరు	ఎం. లక్ష్మణ్
బెంగళూరు నార్త్	ప్రొఫెసర్ ఎం.వీ రాజీవ్ గౌడ
బెంగళూరు సెంట్రల్	మన్సూర్ అలీఖాన్
బెంగళూరు సౌత్	సౌమ్యా రెడ్డి

ఢిల్లీ నుంచి వెనుదిరిగిన సుమలత

మండ్య సిట్టింగ్ ఇండిపెండెంట్ ఎంపీ, సినీనటి సుమలతా చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఉసూరుమంటూ వెనుతిరిగారు. దాదాపు పదిరోజులుగా ఆమె ఢిల్లీలోనే గడిపారు. దాదాపు ఏడాదికి పైగా బీజేపీకు మద్దతు ఇస్తున్నారు. దీంతో బీజేపీ నుంచి టికెట్ ఆశించారు. అయితే జేడీఎస్- బీజేపీల మధ్యన పొత్తుకుదరడంతో జేడీఎస్‌కు సీటు దక్కింది. ఇక్కడి నుంచి కుమారస్వామి పోటీ చేసే అవకాశం ఉంది. మండ్య మినహా మరెక్కడా పోటీ చేసేది లేదని తీర్మానించుకున్న సుమలతా ఇక ప్రయత్నాలు అసాధ్యమని వెనుతిరిగి వచ్చినట్లు తెలిసింది.

సీఎం, డీసీఎంలను కలిసిన అభ్యర్థులు...

ఢిల్లీలో రెండురోజులుగా సాగిన జాబితా కసరత్తులో ఖరారైన పలువురు అభ్యర్థులు సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లను ధన్యావాదాలు తెలిపారు. బళ్ళారి టికెట్ తుకారాంకు ఖరారు కావడంతో ఆయన సీఎంను కలిసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. బీదర్ నుంచి మంత్రి ఈశ్వర్‌ఖండ్రే కుమారుడ సాగర్‌ఖండ్రేకు టికెట్ ఖరారు కావడంతో సీఎం, డీసీఎంలను కలిశారు. అదే తరహాలోనే బెళగావి టికెట్ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ కుమారుడు మృణాళ్‌హెబ్బాళ్కర్, బాగల్‌కోటె టికెట్ మంత్రి శివానంద్ పాటిల్ కుమార్తె సంయుక్తా పాటిల్‌కు ఖరారు కాగా ఆయన ప్రముఖులను కలిశారు. బెంగళూరు ఉత్తర టికెట్ గోవిందరాజనగర్ ఎమ్మెల్యే ప్రియాకృష్ణకు ఖరారు కావడంతో తండ్రి, విజయనగర్ ఎమ్మెల్యే కృష్ణప్పతో కలసి సీఎంను భేటీ అయ్యారు. కాగా ఖరారైన జాబితా శుక్రవారం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.



హంస వాహనం పై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు

హంస వాహనంపై ఖాద్రీశుడు



కదిరి, మార్చి 21: బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామివారు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజ, హోమం, అనంతరం శ్రీవారిని తిరుమాడవీధుల్లో ఊరేగించారు. సంధ్యా సమయంలో శ్రీవారు హంసవాహనం పై విహరించారు. కల్యాణోత్సవ తదుపరి రోజు శ్రీవారు తిరువీధుల్లో విహరించడానికి హంసను నారసింహుడి వాహనంగా బ్రహ్మదేవుడు పంపుతారని భక్తుల నమ్మకం. హంస పాలను నీటిని ఎలా వేరు చేస్తుందో అదేవిధంగా నారసింహుడు భక్తుల్లోని మంచి చెడులను వేరు చేసి మంచిని మాత్రమే స్వీకరిస్తారని విశ్వాసం. హంసవాహనంపై విహరిస్తున్న శ్రీవారిని దర్శించుకోవడానికి పట్టణం నుండే కాకుండా వివిధ గ్రామాల నుంచి భక్తులు విచ్చేశా రు. ఉత్సవానికి ఉభయదారులుగా తోటంశెట్టి రాజగోపాల్‌శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఉత్సవంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డితోపాటు ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు సింహవాహన సేవ

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారు సింహవాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

లోక్‌సభ ఎన్నికల ప్రభావం.. ఎస్ఐ పరీక్షలు వాయిదా

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాల్సిన సబ్‌ఇన్‌స్పెక్టర్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పరీక్షా ప్రాధికార మేనేజింగ్ డైరెక్టర్ రమ్య ప్రకటించారు. మేనెల 8న సబ్‌ఇన్‌స్పెక్టర్ పరీక్షలు జరగాల్సి ఉండేది. అందుకు తగిన ఏర్పాట్లను ప్రాధికార సిద్ధం చేసుకుంటోంది. రాష్ట్రంలో రెండోవిడతగా మే నెల 7వ తేదీన పోలింగ్ జరుగనుంది. లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న వేళ పరీక్షలు నిర్వహించడం ద్వారా ఇబ్బందికరం కానుందని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ప్రకటించారు. తదుపరి పరీక్షల తేదీను ప్రకటిస్తామన్నారు. దీనిని బట్టి మేనెల 8న జరగాల్సిన ఎస్ఐ పరీక్షలు వాయిదా పడ్డాయి.

మెట్రో ట్రాక్‌పైకి దూకి విద్యార్థి ఆత్మహత్య

● బెంగళూరు మెట్రో చరిత్రలోనే దారుణ సంఘటన



ధ్రువకక్కర్(ఫైల్)

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నమ్మమెట్రో ట్రాక్‌పై దారుణం చోటుచేసుకుంది. గురువారం మధ్యాహ్నం విజయనగర్ ప్రాంతానికి అనుబంధంగా ఉండే అత్తిగుప్పె మెట్రో స్టేషన్‌లో న్యాయ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ట్రైన్ సమీపిస్తుండగా ఒక్కసారిగా ట్రాక్‌పైకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ముంబైకి చెందిన ధ్రువకక్కర్(20) బెంగళూరు నేషనల్ కళాశాలలో న్యాయవాద మొదటి సంవత్సరం చదువుతున్నారు. తోటి ప్రయాణీకులు చూస్తుండగానే ధ్రువ కక్కర్ ఫోన్‌లో మాట్లాడుకుంటూ కనిపించారు. ట్రైన్ సమీపానికి వచ్చేసరికే వేగంగా ట్రాక్‌పైకి దూసుకెళ్ళారు. హై ఓల్టేజీ విద్యుత్‌తో పాటు రైలు దూసుకుపోవడంతో శరీరం రెండుముక్కలయ్యింది. వెంటనే అప్రమత్తమైన మెట్రో సిబ్బంది అతడిని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. నగరంలో కొంతసమయం పాటు మెట్రో రైలు సేవలను నిలిపివేశారు. ప్రయాణీకులను ప్రత్యామ్నాయ వాహనాల్లో వెళ్ళాలని సూచించారు. విజయనగర్ పోలీసులు, బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ సీనియర్ అధికారులు స్టేషన్‌ను పరిశీలించారు. బెంగళూరు పశ్చిమ విభాగం డీసీపీ గిరీష్ మెట్రో స్టేషన్‌ను సందర్శించారు. ట్రాక్‌పై నుంచి విద్యార్థిని బయటకు తీసేవేళ అతడి మొబైల్, పర్సును గుర్తించి వాటి ద్వారా అ తడి వివరాలను నిర్ధారించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. కాగా నమ్మమెట్రో సేవలు ప్రారంభమైన తర్వాత తొలిసారిగా ట్రాక్‌పై ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డం కలకలం రేపింది.



అత్తిగుప్పె మెట్రోస్టేషన్

రాజకీయ రంగు పులుముకున్న మేకెదాటు

● మేకెదాటుకోసమే జలవనరుల శాఖ తీసుకున్నా : డీకే ● దమ్ముంటే చెన్నైలో నిరసన చేపట్టండి : బీజేపీ

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కావేరి నదిపై నిర్మించ తలపెట్టిన మేకెదాటు ప్రాజెక్టు రాజకీయ రంగును పులుముకుంది. పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో అధికార డీఎంకే పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో మేకెదాటును అడ్డుకుంటామని ప్రకటించడమే ఇందుకు కారణం. ఇదే అంశాన్ని బీజేపీ తన రాజకీయ అస్త్రంగా మార్చుకుని ఇండియా కూటమిని ఇబ్బందుల్లో పడేసింది. మేకె దాటు ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే చెన్నయ్‌లో డీఎంకే కార్యాలయం ముందు నిరసన జరుపాలని కాంగ్రెస్‌కు సవాల్ విసిరింది. శాసన సభలో ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ నగరంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ ఇండియా కూటమి రాజకీయాల కోసం కాంగ్రెస్ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను ఫణంగా పెడుతోందని విరుచుకుపడ్డారు. జలవివాదం సెంటిమెంట్‌కావడంతో ఈ అంశం ద్వారా గరిష్టంగా రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపి తన వ్యూహాలకు పదును పెడుతోంది.


మేకెదాటు నిర్మాణం ఆపే ప్రసక్తే లేదు.. : డీసీఎం డీకే. శివకుమార్



మేకెదాటుకు ఇండియా కూటమికి సంబంధం లేదని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. నగరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. మేకెదాటు ప్రాజెక్టును నిర్మిస్తే రాజధాని ప్రజల తాగునీటి దాహార్తి పూర్తిగా తీరుతుందని అందుకే తాను ఏరికోరి మరీ జలవనరుల శాఖను తీసుకున్నానన్నారు. మేకెదాటు విషయంలో బీజేపీ నేతల తీరును ఆయన దుయ్యబట్టారు. చాలా సంవత్సరాలుగా మేకెదాటుకు అనుమతి కోసం కేంద్రానికి విజ్ఞప్తిచేస్తూనే ఉన్నామని చెప్పారు. మేకెదాటుకు అనుమతి ఇవ్వాలింది తమిళనాడు కాదని కేంద్ర ప్రభుత్వమన్న కనీస ఇంగిత జ్ఞానం బీజేపీ నేతలకు లేకపోవడం సిగ్గుచేటన్నారు. తమిళనాడులో డీఎంకే తన మేనిఫెస్టోలో ఏం చెప్పినా తాము పట్టించుకోబోమన్నారు. మేకెదాటు ప్రాజెక్టు నిర్మాణ వాదనను తాము తొలి నుంచి బలంగా ప్రతిపాదిస్తున్న సంగతిని ఆయన గుర్తుచేశారు. మేకెదాటు ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి ఇచ్చి ఉంటే ఈ పాటికి ప్రాజెక్టు పూర్తయిఉండేదని తద్వారా నగర ప్రజల తాగునీటి దాహార్తి కూడా తీరి ఉండేదన్నారు. నగరంలో తాగునీటి సమస్య తీవ్రతకు కేంద్రం కూడా పరోక్షంగా కారణమని ఆయన దుయ్యబట్టారు. ప్రతీ దానికి రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేయడం బీజేపీ నేతలకు అలవాటుగా మారిందన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ నేత ఆర్.అశోక్



నగరవాసులకు కెనెడియా బ్లూ కెఫె రుచులు..

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో విభిన్న రుచులతో కూడిన ఆహార పదార్థాలను ఖాతాదారులకు అందించే హోటళ్ళు చాలా ఉన్నాయి. ఈ జాబితాలోకి కెనెడియా కెఫె కూడా చేరింది. బెంగళూరు కెనడియా బ్లూ కెఫెను బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో అత్యంత పిన్నవయస్కుడైన మోటివేటెడ్ స్పీకర్ అక్షిత్ కెనెడియా లాంఛనంగా ప్రారంభించారు. రుచుల ప్రపంచంలోకి కెనెడియా అడుగుపెట్టిందని ఇక వినియోగదారులు వీటిని ఆస్వాదించడమే తరువాయి అని అక్షిత్ పేర్కొన్నారు. బెంగళూరు- హైదరాబాద్ జాతీయ రహదారి 7పై చిక్కబళ్ళాపురం శివారులో విశాలమైన ప్రదేశంలో ఈ కెఫె వెలిసింది. ఇందులో స్టార్ బక్స్, కోస్టా కాఫీ, మెక్‌డొనాల్డ్ వంటి ప్రముఖ బ్రాండ్ల ఆహార పదార్థాలు అందుబాటులో ఉంటాయని కెనెడియా బ్లూ కెఫె మేనేజింగ్ డైరెక్టర్ డా. జయప్రకాష్ మీడియాకు చెప్పారు. పలు వైవిధ్యభరితమైన అత్యంత రుచికరమైన ఆహార పదార్థాలు తమ కెఫెలో అందుబాటులో ఉంటాయన్నారు. బెంగళూరునగరంలోని ఇతర ప్రాంతాల్లోనూ కెనెడియా బ్లూ కెఫె శాఖలను ప్రారంభించే ఆలోచన ఉందన్నారు. వినియోగదారుల అభిరుచులను దృష్టిలో ఉంచుకుని ఈ కెఫెలకు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. 2047 నాటికి ప్రపంచవ్యాప్తంగా 50వేల శాఖలను ప్రారంభించడం ద్వారా ఈ బ్రాండ్‌కు బహుళ ప్రాచుర్యం కల్పించాలన్నది తమ లక్ష్యమని ఆయన వెల్లడించారు. ప్రత్యేకించి కాఫీ ప్రియులకు ఈ కెఫె అద్భుతైన కేంద్రంగా ఉంటుందన్నారు. తొలి రోజే ఈ కెఫెకు వినియోగదారులు పోటెత్తారు. రుచి అద్భుతంగా ఉందంటూ ప్రశంసలు గుప్పించారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా గుంజన్ రామ్ తదితరులు పాల్గొన్నారు.



కెనెడియా బ్లూ కెఫెను ప్రారంభిస్తున్న అక్షిత్ కెనెడియా

మండుతున్న పండ్ల ధరలు

● ఎండల ప్రభావంతో పెరిగిన వినియోగం



బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరు నగరంలో ఎండలు విపరీతంగా పెరిగిపోతుండటంతో పండ్లు, ఆకుకూరల ధరలు ఆకాశాన్నంటాయి. ఇదే సమయంలో కూరగాయల ధరలు కాస్త తగ్గుముఖం పట్టడం వినియోగదారులకు ఊరటనిస్తోంది. యాలక్కి అరటి పండ్ల ధర కిలో రూ. 70కు చేరుకుంది. వేసవి తీవ్రత నుంచి తప్పించుకునేందుకు ప్రజలు పండ్ల రసాలను అధికంగా సేవిస్తుండటంతో ఆపిల్, నారింజ, బత్తాయి, సపోటా, బొప్పాయి, జామ, దానిమ్మ, కర్బూజా పండ్ల ధరలు సాధారణ రోజులతో పోల్చితే 30 నుంచి 50 శాతం పెరిగాయని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. ద్రాక్ష పంట మార్కెట్‌లోకి ఇంకా పూర్తి ప్రమాణంలో రాకపోవడంతో ఇది కూడా కిలో రూ. 80 వరకు పలుకుతోంది. నిమ్మకాయల ధరలు కూడా దాదాపు రెట్టింపు పలుకుతున్నాయి. ఒక్కోనిమ్మకాయ ధర రూ. 15 పలుకుతోంది. ఆకుకూరల ధరలు గత వారం వరకు కట్ట రూ.10 లోపే ఉండగా అమాంతం ఇది రూ. 30 వరకు పెరిగింది. పాలాక్, పొదీనా, కొత్తిమీర, మెంతికూర, తోటకూర తదితర ఆకుకూరల ధర రెట్టింపు కన్నా అధికంగా ఉంది. వారంతం నాటికి ఉష్ణోగ్రత ఇంకా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో పండ్లు, ఆకుకూరల ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.



స్థిరంగా ఉల్లి, వెల్లుల్లి ధరలు

మొన్నటి వరకు అమాంతం పెరిగిన ఉల్లి, వెల్లుల్లి ధరలు మాత్రం స్థిరంగా ఉన్నాయి. ఉల్లి ధర మార్కెట్‌లో కిలో రూ. 20 పలుకుతుండగా కొత్త వెల్లుల్లి ధర కిలో రూ. 200గా ఉంది. టమోటాల ధర కూడా రూ. 20 వద్ద స్థిరంగా ఉంది. నిన్నటి వరకు కిలో రూ. 80 వరకు ధర పలికిన బీన్స్ ఒక్కసారిగా రూ. 30కు పడిపోయింది. క్యారట్, బీట్‌రూట్ ధరలు కిలో రూ. 40 వద్దే స్థిరంగా ఉన్నాయి.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,582.20	1,593.51
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	533
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	765	8,252
సామర్థ్యం (టీఎంసీలు)	5.63	14.21

వేటగాళ్ల బెడదను అరికట్టాలి



తుంగభద్ర నదీతీరంలో ఆహార వేటలో పక్షులు

బళ్లారి సిటీ, మార్చి 21: తుంగభద్రా జలాశయ పరిసర ప్రాంతాల్లో పక్షులకు వేటగాళ్ల బెడద నుంచి విముక్తి కల్పించాలని వన్యజీవి ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వ తగ్గడంతో వేటగాళ్లు మాటు వేసి వలవేసి పక్షులను పట్టుకుంటున్నారన్నారు. అందువల్లే అరుదైన పక్షులు రావడంలేదన్నారు. జలాశయంలో నీరు తగ్గినప్పుడు పక్షులు గుంపుగుంపులుగా వచ్చి సమీపంలోని చెరువులో దొరికిన పురుగులు, చిన్నచేపలు, ఎండ్రకాయలను ఆహారంగా తీసుకోవడం అనవాయితీ అన్నారు. ఈసందర్భంగా పక్షులను వేటాడే వేటగాళ్లను అరికట్టి పక్షులకు స్వేచ్ఛ కల్పించాలన్నారు.

సమాజ సేవతోనే గుర్తింపు

కంప్లి, మార్చి 21 : సమాజంలో సేవల వల్లే ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందని కుడితిని పట్టణ పంచాయతీ మాజీ అధ్యక్షులు రాజశేఖర్ తెలిపారు. మూడు రోజుల క్రితం వీరశైవ సంఘం ఎన్నికల్లో తమ పట్టణానికి చెందిన పల్లెద ప్రభుకు 1033 అత్యధిక ఓట్లు పోలయ్యాయన్నారు. ఆయన కుడితిని పోలీస్ స్టేషన్, పాఠశాల ఇతర పేద కుటుంబాలవారికి ఎన్నో సేవలు చేయడంతోనే అత్యధిక ఓట్లు పోలయ్యాయని తెలిపారు. గురువారం ఆయనను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో తిరుమలేష్, క్రిష్టప్ప, యర్రిస్వామి పాల్గొన్నారు.

టిక్కెట్ ఇవ్వకుంటే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ

మాజీ ఎంపీ కరడి సంగన్న



సమావేశంలో మాట్లాడుతున్న కరడి సంగన్న

గంగావతి రూరల్, మార్చి 21: బీజేపీ టిక్కెట్ ఇవ్వకుంటే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని మాజీ ఎంపీ కరడి సంగన్న తెలిపారు. కొప్పళ జిల్లా బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా ఎంపీగా ఉండి ఎన్నో అభివృద్ధిపనులు చేశానన్నారు. ప్రజల్లో బీజేపీ బలపడడానికి కృషి చేసిన తనకు ఎంపీ టికెట్టు ఇవ్వకుండా వేరేవాళ్లకు ఇచ్చినందుకు బీజేపీ అభిమానులు, కార్యకర్తలు బాధ పడుతున్నారన్నారు. బీజేపీ హైకమాండ్ రెండు మూడు రోజుల్లో టిక్కెట్ ఇవ్వకుంటే స్వతంత్ర అభ్యర్థిగా నిలబడతానని తెలియజేశారు.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి

బళ్లారిరూరల్, మార్చి 21 : బళ్లారి నగరం హుస్సేన్ నగర్‌లో ఈ నెల ఐదవ తేదీన ఘర్షణలో గాయపడిన తిప్పేస్వామి చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. బళ్లారి మాజీ మేయర్ నాగమ్మ కుమారుడు రఘు మార్చి 5వ తేదీన తన పుట్టిన రోజు వేడుకల సందర్భంగా అదే దోవలో వెళుతున్న తిప్పేస్వామితో ఘర్షణ పడ్డాడు. ఈ సందర్భంగా అతని స్నేహితులు 12 మంది ఒక్కసారిగా తిప్పేస్వామిపై మారణాయుధాలతో విచక్షణా రహితంగా దాడి చేయడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు అతనిని బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తిప్పేస్వామి గురువారం మృతి చెందాడు. ఈ సంఘటనపై గాంధీనగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదుచేసి తిప్పేస్వామిపై దాడి చేసిన రఘుతో పాటు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. మరో ముగ్గురికోసం గాలిస్తున్నారు.

బళ్లారి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా తుకారాం

- అనూహ్యంగా తెరపైకి సండూరు ఎమ్మెల్యే అభ్యర్థిత్వం
- వరుసగా నాలుగు సార్లు గెలిచిన అనుభవం
- మంత్రి సంతోష్ లాడ్‌కు అత్యంత ప్రియ శిష్యుడు
- మాజీ ఎంపీ ఉగ్రప్ప, మంత్రి నాగేంద్ర సోదరుడు వెంకటేశ్‌ప్రసాద్‌కు మొండిచేయి

బళ్లారి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బళ్లారి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా సండూరు ఎమ్మెల్యే తుకారాంను ఆ పార్టీ ఖరారు చేసింది. ఇప్పటికే బీజేపీ నుంచి మాజీ మంత్రి శ్రీరాములు పోటీలో ఉన్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ మాత్రం అనూహ్యంగా సండూరు ఎమ్మెల్యే తుకారాంను తెరపైకి తెచ్చింది. సండూరు ఎమ్మెల్యేగా తుకారం కాంగ్రెస్ పార్టీ నుండి ఏకంగా నాలుగుసార్లు గెలుపొందారు. 2008, 2013, 2018, 2023 లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తుకారాం వరుసగా గెలుపొందుతూ వచ్చారు. అంతేకాకుండా 2018లో ఏడాది పాటు మంత్రిగా కూడా పనిచేశారు.

సంతోష్ లాడ్ ఫ్యామిలీకి తుకారాం అత్యంత నమ్మకస్తుడు. 2004 వరకూ సంతోష్‌లాడ్ సండూరు నియోజక వర్గ జేడీఎస్ ఎమ్మెల్యేగా ఉన్నారు. సండూరులో గోర్పడే రాజులకు ముందునుండి ఆధిపత్యం ఉండేది. కానీ 2008లో ఈ నియోజకవర్గం ఎస్టీ లకు రిజర్వ్ అయింది. అప్పుడు లాడ్ కంపెనీలో గుమస్తాగా పనిచేస్తున్న వాల్మీకి సముదాయానికి చెందిన తుకారాంను ఎస్టీ రిజర్వేషన్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయించారు.

ప్రస్తుతం జరుగుతున్న ఎంపీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నుంచి మంత్రి నాగేంద్ర సోదరుడు వెంకటేశ్ ప్రసాద్, అలాగే మాజీ ఎంపీ ఉగ్రప్ప, తుకారాం కూతురు పేర్లను అధిష్టానం పరిశీలించింది. ఒకానొక దశలో మంత్రి నాగేంద్రపేరును కూడా ప్రతిపాదించారు. శ్రీరాములు మీద నాగేంద్రను నిలిపితే బాగుంటుందని భావించారు. కానీ నాగేంద్ర ఎందుకో వెనుకంజవేశారు. కానీ అనూహ్యంగా సండూరు ఎమ్మెల్యే తుకారాం పేరును ఎంపీ అభ్యర్థిగా తెరపైకి తీసుకువచ్చారు. వాస్తవానికి తుకారాం కూడా మంత్రి రేసులో ఉన్నారు. కానీ ఆయన గురువు సంతోష్‌లాడ్‌కు మంత్రి పదవి ఇవ్వడంతో ఇద్దరికీ మంత్రి పదవి ఇవ్వడం కుదరలేదు. బెంగళూరులో గురువారం సీఎం సిద్దరామయ్యను కావేరి భవన్‌లో మంత్రులు సంతోష్ లాడ్, జమీర్ అహ్మద్, బి.నాగేంద్ర, సండూరు ఎమ్మెల్యే తుకారాం, బళ్లారి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ కలిశారు. వీరి భేటీలో చివరకు బళ్లారి ఎంపీగా తుకారాం పేరునే సీఎం ఖరారు చేశారు. అదే విషయాన్ని ఏఐసీసీ కూడా ప్రకటించింది. మొత్తం మీద అనూహ్యంగా తుకారాం పేరును ప్రకటించడంతో శ్రీరాములుపై పోటీకి కాంగ్రెస్ గట్టి అభ్యర్థినే రంగంలోకి దింపిందని పలువురు భావిస్తున్నారు.



ఎంపీ అభ్యర్థి తుకారాంతో సీఎం సిద్దరామయ్య, మంత్రులు నాగేంద్ర, సంతోష్‌లాడ్

ఎన్నికల కంట్రోల్ రూం ప్రారంభం

బళ్లారి సిటీ,మార్చి 21: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలను జిల్లాలో పారదర్శకంగా నిర్వహించేందుకు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వినేందుకు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ఎన్నికలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్లు 08392, 277100, 1950లకు తెలియజేయవచ్చని జిల్లాఎన్నికల అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు



బీరప్ప ఆలయం వద్ద జేసీబీతో తవ్విన దృశ్యం

కంప్లి, మార్చి 21 : విజయనగర జిల్లా హోస్పేట తాలుకాలోని ధర్మసాగర గ్రామం వద్ద పొలాల్లో బుధవారం రాత్రి దుండగులు తవ్వకాలు చేపట్టారు. సుమారు పది అడుగులకు పైగా జేసీబీ ద్వారా తవ్వకాలు చేపట్టారు. గమనించిన అక్కడున్న ప్రజలు కేకలు వేయడంతో అక్కడి నుంచి పరుగులు తీశారు. ఈ విషయం గ్రామీణ విభాగం పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనుమానం వున్న వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

షరీఫ్ తాత ఉరుసు మహోత్సవం



దర్గాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, మార్చి 21 : తాలుకాలోని నాగరాళ గ్రామంలో ప్రతి యేడాది షరీఫ్ తాత ఉరుసు మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. దీంతో బుధ, గురు, శుక్రవారాల్లో మూడు రోజుల పాటు గంధం, ఉరుసు, జియారత్ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బీఎం నాగరాజు ఉరుసు మహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏపీఎంసీ మార్కెట్‌లో రైతులకు కుచ్చుటోపీ

- రూ. 1.5 కోట్ల సరుకుతో ఉడాయించిన ట్రేడర్
- రెండు రోజులుగా బళ్లారి మార్కెట్‌లో నిల్చిపోయిన కొనుగోళ్లు

బళ్లారి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బళ్లారి ఏపీఎంసీ మార్కెట్ యార్డులో ఒక ట్రేడర్ రైతులను, సహచర ట్రేడర్స్‌ను మోసం చేసి రూ. 1.5 కోట్లు సరుకుతో ఉడాయించిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సరుకు అమ్మిన రైతులకు డబ్బులు ఇవ్వకుండా, అలాగే ఇతర ట్రేడర్లకు సరుకు అప్పచెప్పకుండా ఉడాయించడంతో అసలు సమస్య వెలుగులోకి వచ్చింది. ఏపీఎంసీ సెక్రటరీ కార్యాలయం ఎదురుగా ఉండే ఒక ట్రేడింగ్ కంపెనీకి వివిధ ప్రాంతాల నుండి రైతులు సరుకు విక్రయించారు. ఆ రైతులకు డబ్బులు ఇవ్వకుండా, ఇతర ట్రేడర్లకు సరుకు అప్పగించకుండా మొదటి ట్రేడర్ సరుకును ఇతర ప్రాంతాలకు తరలించాడు. గత నాలుగు రోజులుగా ఆ ట్రేడర్ కనిపించకుండా పోవడంతో ఏపీఎంసీలో ఉండే ఇతర వ్యాపారులతోపాటు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ ట్రేడర్ వచ్చి రైతులకు, అలాగే మిగిలిన ట్రేడర్లకు డబ్బులు, లేదా సరుకు అప్పగించేంత వరకూ ఏపీఎంసీ మార్కెట్‌లో క్రయవిక్రయాలు నిలిపేయాలని అసోషియేషన్ నిర్ణయం తీసుకుని రెండు రోజులుగా క్రయవిక్రయాలు నిలిపేసింది. మార్కెట్‌కు వచ్చిన సరుకును అమ్మేందుకు యార్డుల్లో వేయకుండా దుకాణాల వద్ద నిట్టు పేర్చి దానిపై టార్పాల్ కప్పేశారు. చివరకు గురువారం రాత్రి పరారీలో ఉన్న ట్రేడర్‌ను పిలిపించి అసోషియేషన్ పంచాయితీ పెట్టిందని సమాచారం. సరుకు అమ్మిన రైతులకు, అలాగే కొన్న ట్రేడర్లు నష్టపోకుండా అసోషియేషన్ రాజీ మార్గంలో పంచాయితీ చేసిందని సమాచారం. అయితే దీన్ని ఎట్టిపరిస్థితుల్లో బయటకు పొక్కకుండా చూశారు. అయితే కొందరు రైతులు, ట్రేడర్లు ఆందోళనకు దిగడంతో నాలుగు రోజులుగా రహస్యంగా ఉంచిన విషయం రట్టయింది.



ఏపీఎంసీ మార్కెట్‌లో క్రయవిక్రయాలు నిలిపేసి సరుకుపై టార్పాల్ కప్పిన దృశ్యం

వైభవంగా గాణిగట్టి మాయమ్మ రథోత్సవం

కంప్లి, మార్చి 21 : విజయనగర జిల్లా కూడ్లిగి తాలుకా పరిధిలోని పేరుగాంచిన గాణిగట్టి మాయమ్మ దేవి రథోత్సవం వైభవంగా జరిగింది. రాష్ట్రంతో పాటు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారికి ఉదయాన్నే జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, లలిత సహస్రనామార్చన చేపట్టారు. సాయంత్రం ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు రథాన్ని ఊరేగించి తిరిగి ఆలయం వరకు తిప్పి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పూలు, పండ్లతో మొక్కులు తీర్చుకున్నారు.



గాణిగట్టిలో సాగుతున్న మాయమ్మదేవి రథోత్సవం

పులుపెక్కిన విజయనగర 'చింత'

ధరల పతనంతో దిక్కుతోచని రైతులు, క్వింటాల్‌కు రూ.ఆరువేలు పలుకుతున్న వైనం

బళ్లారి గాంధీనగర్, మార్చి 21: విజయనగర జిల్లా రైతులు ప్రత్యామ్నాయ పంటగా చెప్పుకునే చింతపండు ధర పడిపోవడంతో ఈ సారి ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విజయనగర జిల్లా పరిధిలో కూడ్లిగి ప్రాంతాల్లో చింతచెట్లనే ప్రధాన ఆదాయ వనరులుగా చేసుకుని పెంచుతుంటారు. చాలామంది రైతులు చింత చెట్లను కౌలుకు తీసుకుని సీజన్‌లో చెట్లనుండి చింతకాయలను రాల్చి.. చింతపండును తీస్తారు. అయితే మార్కెట్‌లో ఈ సారి చింతపండుకు సరైన ధర లభించక పోవడంతో చింతచెట్లను కౌలుకు తీసుకున్న రైతులు, వ్యాపారులు నష్టాలను చవిచూస్తున్నారు. సాధారణంగా సాగుభూముల గట్లపైన ఇళ్లపక్కన పెంచిన చింతచెట్లు ఏటా దిగుబడినిస్తాయి.అటవీశాఖ అధికారుల గణాంకాల మేరకు కూడ్లిగి తాలూకా పరిధిలో ఐదువేల చెట్లు ఉన్నట్లు గురించారు. అయితే ఈ సారి వర్షాలు కురవక పోవడంతో చింతకాయల దిగుబడి చాలా తగ్గింది. గత ఏడాది ప్రతి క్వింటాల్ చింతపండు రూ. 9వేలు పలుకుతుండగా, ప్రస్తుతం అది ఆరువేల రూపాయిలకు తగ్గింది. చెట్లనుండి చింతకాయలు కోయడానికి కూలి రూ 500లు, చెట్లనుండి క్రిందపడిన చింతకాయలు ఏరడానికి రూ. 250, కాయల నుండి విత్తనాలు వేరుచేయడానికి కిలోకు రూ.10లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇదంతా తడిసి మోపెడవుతున్నట్లు రైతు భీమన్న తెలిపారు. అన్ని ఖర్చులు చేరి ప్రతి క్వింటాల్ చింతపండుకు రూ. 5వేలు ఖర్చవుతోందన్నారు. అయితే తీరా మార్కెట్‌కు తీసుకెళితే క్వింటాల్‌కు రూ.6వేలు ధర లభిస్తుండడంతో పెట్టిన పెట్టుబడి రావడం లేదని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. కూడ్లిగి తాలూకాలో మార్కెట్ వ్యవస్థ లేకపోవడంతో హొసపేట, చెళ్ళకెర, చిత్రదుర్గ వ్యవసాయ మార్కెట్‌కు తీసుకెళ్లాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దతు ధర లభించేంత వరకు చింతపండు నిలువ చేయడానికి కోల్డ్ స్టోరేజి లేకపోవడంతో వచ్చినకాటికి అమ్ముకోవాల్సి వస్తుందని కూడ్లిగికి చెందిన పలువురు రైతులు వాపోతున్నారు.



చింతపండును వేరుచేసే పనిలో నిమగ్నమైన కూలీలు

తనిఖీలలో మద్యం, నగదు స్వాధీనం

బళ్లారి సిటీ, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చేసిన తనిఖీలలో భాగంగా గురువారం 472.01లీటర్ల మద్యం, రూ.7,37,240 వెండి, సరైన పత్రాలు లేని రూ. 3.55,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. అదే విధంగా 12,000 కిలోల మైల్డ్ స్టీల్ స్క్రాప్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇప్పటి వరకు మొత్తం 32కేసులు నమోదయ్యాయన్నారు. 16 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 24 ఎస్ఎస్‌టీ బృందాలు, ఏడు ఎక్సైజ్ బృందాలు పనిచేస్తున్నాయని డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు.

సరిహద్దు చెక్‌పోస్టులను తనిఖీ చేసిన కలెక్టర్

బళ్లారిరూరల్, మార్చి 21 : బళ్లారి తాలుకాలోని అనంతపురం రోడ్డులో చేళగుర్కి, రూపనగుడి, కారేకల్ వీరాపురం, హోస్పేట రోడ్డు, మోకా, సింధవాళం, బళ్లారి ఆటోనగర్, పలు ప్రాంతాల్లోని చెక్‌పోస్టులను గురువారం మధ్యాహ్నం బళ్లారి కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టులో వున్న అధికారుల సమస్యలను తెలుసుకున్నారు.

చెక్‌పోస్టు వద్ద రూ. 1.63 లక్షలు నగదు పట్టివేత

సిరుగుప్ప, మార్చి 21 : సిరుగుప్ప తాలుకాలోని ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఇటిగేహాళ్ చెక్‌పోస్టువద్ద గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక కారులో రూ. 1.63 లక్షలు నగదును తరలిస్తుండగా పట్టుకున్నారు. అయితే ఈ నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో నగదును, కారును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రథోత్సవాన్ని వైభవంగా జరుపుకుందాం



శాంతిసభలో మాట్లాడుతున్న సీఐ విశ్వనాథ్ హిరేమఠ్

కంప్లి, మార్చి 21 : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన దొడ్డ బసవేశ్వరస్వామి రథోత్సవాన్ని ఈ నెల 25న వవైభవంగా జరుపుకుందామని డీవైఎస్పీ ప్రసాద్ గోఖలే తెలిపారు. కురుగోడు పోలీస్ స్టేషన్ ఆవరణంలో పోలీసులు ఏర్పాటు చేసిన శాంతిసభలో తెలిపారు. రథోత్సవ కార్యక్రమంలో ముష్టిగట్టి, కెరికెర, సోమలాపురం గ్రామాల ప్రజలు కుంభోత్సవం సమయంలో కూడా ఎలాంటి పోటీలు పడకుండా అందరూ కలసికట్టుగా పూజలు నిర్వహించుకోవాలని తెలిపారు. అనంతరం సీఐ విశ్వనాథ్ హిరేమఠ్ మాట్లాడుతూ ఈ రథోత్సవంలో ఎవరు ఘర్షణలు చేపట్టినా వారిపై చర్యలు తప్పవని సూచించారు.

హోసూరు జోన్

గంజాయి విక్రయిస్తున్న అస్సాం యువకుల అరెస్ట్



అరెస్ట్ అయిన అస్సాం యువకులు

హోసూరు(సిప్‌కాట్) మార్చి 21 : హోసూరు సిప్‌కాట్ పేస్-2 ప్రాంతంలో గంజాయి ఇద్దరు వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్ట్ చేసి వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో వేలాది మంది ఉత్తరాది కార్మికులు పని చేస్తున్నారు. వారు డ్రగ్స్‌కు అలవాటు పడి డ్రగ్స్ వాడడం, అమ్మడం సర్వసాధారణంగా చేస్తున్నారు. అస్సాం రాష్ట్రం నుంచి వస్తూ ఉత్తర రాష్ట్ర కూలీలు గంజాయి ఉత్పత్తులను అక్రమంగా తరలిస్తుంటారు. గురువారం హోసూరు సమీపంలోని జేగేపల్లి అన్నానగర్ ప్రాంతంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు కలాల్ పోలీసులు పక్కా సమాచారం అందుకుని దాని ఆదారంగా డీఎస్పీ శివలింగం నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ షర్మిలాబాను, పోలీసులు అక్కడికి వెళ్లి సోదాలు నిర్వహించారు. అప్పుడు రోడ్డుపై వెళుతున్న యువకులకు గంజాయి విక్రయిస్తున్న అస్సాంకు చెందిన మిజనూర్ అలీ(35) వద్ద నుంచి ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గోవింద అగ్రహారం ప్రాంతంలో విక్రయిస్తున్న వంద ఉమేద్ అలీ (24) , రాజ్‌కుమార్ ఛత్రీ (30)ల నుంచి రెండు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు అవసరం

హోసూరు(కృష్ణగిరి) మార్చి 21 : ప్రస్తుత వేసవి కాలంలో కృష్ణగిరి జిల్లాలో పలుచోట్ల అడవుల్లో మంటలు చెలరేగుతున్నాయని, ప్రజలు అడవిలో అగ్ని ప్రమాద ప్రాంతాలను తెలుసుకొని ఆ ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని, వేసవిలో ట్రెక్కింగ్ కు దూరంగా ఉండాలని అటవీ అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేయాలని ప్రజలను కలెక్టర్ అభ్యర్థించారు. అలాగే జంతువుల సంచారాన్ని ముఖ్యంగా ఏనుగుల సంచారాన్ని అటవీశాఖ అధికారులు వేగంగా పసిగట్టి సంబంధిత ప్రాంత ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తున్నారన్నారు. ఏనుగులు ఎక్కువగా ఉండే ప్రాంతాలకు వెళ్లకుండా అధికారుల సలహాలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఎన్నికలలో నిబద్ధతతో పనిచేయాలి

హోసూరు(కృష్ణగిరి) మార్చి 21 : కృష్ణగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాలకు నియమించిన కమిటీ ఎన్నికల పనిలో పూర్తి నిబద్ధతతో పనిచేయాలని ఎన్నికల అధికారులు కోరారు. వారు తమకు కేటాయించిన ఉద్యోగ బాధ్యతలను తెలుసుకోవాలని, ఎన్నికల ఖర్చులపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు నియమించబడిన సహాయ వ్యయ పర్యవేక్షకులు అభ్యర్థుల ఖర్చులను పర్యవేక్షిస్తారని, అలాగే ఎన్నికల ఖర్చులకు సంబంధించిన ఫిర్యాదుల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, వాటిపై చర్యలు తీసుకోవడాన్ని సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. కావున ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సంపూర్ణంగా సహకరించాలన్నారు. తదనంతరం సుదన్సుశేఖర్ గౌతమ్ ఎన్నికల వ్యయ పరిశీలకుడగా నియమితు లయ్యారు. అలాగే భోసలే సందీప్ ధినకర్ ఐఆర్ఎస్ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్ మీడియా మానిటరింగ్ సెంటర్‌ను స్వయంగా సందర్శించి టెలివిజన్, సోషల్ మీడియా వార్తపత్రికలలో వచ్చే అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు ప్రకటనలను పూర్తిగా పర్యవేక్షించాలని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని తెలియజేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎ.సాధనకురళ్, జిల్లా ఇంటర్వ్యూ అసిస్టెంట్ కలెక్టర్ పి.ఎస్.లెన్నిన్, జిల్లా కలెక్టర్ అసిస్టెంట్ కదిరవన్, జిల్లా ఎన్నికల అధికారి సంపత్, అసిస్టెంట్ ఎలక్షన్ వ్యయ అధికారులు గ్రూఫ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఎన్నికల కోడ్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ రాహుల్ తుకారామ్ పాండ్వే

రాయచూరు, మార్చి 21 : లోకసభ ఎన్నికల షెడ్యూల్ వెలవడిన నాటి నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉందని జిల్లా స్వీప్ కమిటీ అధ్యక్షుడు, జడ్పీ సీఈఓ రాహుల్ తుకారామ్ పాండ్వే తెలిపారు. కోడ్ అమలును కట్టుదిట్టంగా చేపట్టాలని ఇందులో ఎలాంటి అలసత్వానికి తావు లేదని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎస్ఎస్‌టీ కమిటీల బాధ్యులతో గురువారం జడ్పీ సమావేశ మందిరంలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాటైన కమిటీ సభ్యులకు ఈ సందర్భంగా శిక్షణనిచ్చారు. సమావేశంలో మాట్లాడిన జడ్పీ సీఈఓ శాసనసభ నియోజక వర్గాల వారిగా నియమితులైన నోడల్ అధికారులు ఎన్నికల ప్రచారం, వ్యయం, తదితర వాటిపై గట్టి నిఘా ఉంచాలన్నారు. అదే సమయంలో ఎక్కడ ఉల్లంఘన జరిపినా తప్పని సరిగా ఉన్నత అధికారుల దృష్టికి తేవాలని బాధ్యులకు నోటీసులు జారీ చేయాలన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా అభ్యర్థులు వారి తరఫున మద్దతుదారుడు పార్టీకి చేసే ఖర్చు పై పూర్తి నిఘా ఉంచాలన్నారు.

కట్టుకున్న భర్తను కడతేర్చిన భార్య

రాయచూరు, మార్చి 21 : అక్రమ సంబంధానికి అడ్డువస్తున్నాడన్న కారణంతో కట్టుకున్న భర్తనే కడ తీర్చిన ఓ ఇల్లాలి ఉదంతం ఇది. ఈ సంఘటన తాలూకాలోని సింగనోడి తాండాలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. తాండాకు చెందిన రాజు నాయక్(38)కు నాల్గేళ్ల క్రితం వివాహం కాగా భార్యకు మహారాష్ట్రకు చెందిన మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని తెలిసింది. ఇదే విషయంపై గడచిన రెండేళ్లుగా భార్యాభర్తలిద్దరి మధ్య తగాదా జరుగుతుండగా బుధవారం రాత్రి భర్తకు తప్ప తాగించిన భార్య అతడు నిద్ర మత్తులో ఉండగా గొంతు నులిమి చెంపేసింది. విష యం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. నిందితురాలు స్నేహను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.




హత్యకు గురైన రాజు నాయక్(ఫైల్)

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంమ్...

ఎంఎన్ రాయ్ (జయంతి)



ఎంఎన్ రాయ్‌గా పేరొందిన మానవేంద్రనాథ రాయ్ 1887 మార్చి 21న పశ్చిమబెంగాల్ రాష్ట్రం అర్బేలియా ప్రాంతంలో జన్మించారు. హేతువాది, మాన వతావాది, రాజకీయ సిద్ధాంత కర్త, రచయిత. రష్యా తర్వాత ప్రపంచంలో మొదటిగా మెక్సికోలో కమ్యూనిస్టు పార్టీ స్థాపించిన వ్యక్తి రాయ్. మొట్టమొదటి కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్‌కు మెక్సికో అధికార ప్రతినిధిగా వ్యవహరించారు. మనదేశానికి ప్రత్యేక రాజ్యాంగం ఉండాలనే భావనను ప్రతిపాదించిన తొలి భారతీయుడు. ఆంగ్లము, జర్మన్, ఫ్రెంచి, రష్యన్, స్పానిష్ తదితర 17 భాషలు ఆయనకు తెలుసు. 1954 జనవరి 25న కన్నుమూశారు.

సుమ కనకాల (పుట్టినరోజు)



ప్రజాదరణ పొందిన తెలుగు బుల్లితెర వ్యాఖ్యాత(యాంకర్ల)లో ఒకరు. 1975 మార్చి 22న జన్మించారు. కేరళకు చెందిన ఆమె మాతృభాష తెలుగు కానప్పటికీ, తెలుగులో అనర్గళంగా మాట్లాడగలరు. చక్కటి వ్యాఖ్యానం, చిరునవ్వు, సమయస్ఫూర్తితో ఈమె రంగంలో రాణిస్తున్నారు. తెలుగు, మళయాళంలతోపాటు హిందీ, ఆంగ్ల భాషలలోనూ మాట్లాడగలరు. టీవీ కార్యక్రమాలకే కాక ఆడియో రిలీజ్ ఫంక్షన్‌లలో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. తోటి నటుడు రాజీవ్ కనకాలను పెళ్లి చేసుకున్నారు. 2010లో ఉత్తమ టీవీ వ్యాఖ్యాత, తదితర అవార్డులు అందుకున్నారు.

కన్నడిగుల ప్రయోజనాలను కాపాడేవారికే మద్దతు

● కన్నడ చళవళి పార్టీ అధ్యక్షుడు వాటాళ్ నాగరాజ్

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో కన్నడిగుల ప్రయోజనాలను కాపాడే దిశలో బలంగా బాణిని వినిపించే అర్హులైన అభ్యర్థులనే గెలిపించాలని కన్నడ చళవళి వాటాళ్ పార్టీ అధ్యక్షుడు వాటాళ్ నాగరాజ్ ప్రజలకు పిలుపునిచ్చారు. బెంగళూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బంధువులు, కులాలు, మతాలను పక్కన పెట్టి యోగ్యులను ఎన్నుకుంటే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. బెంగళూరులో విదేశీ మహిళల హత్యలను ప్రస్తావిస్తూ ఇలాంటి ఘటనలు జరుగుతుంటే విదేశీ పర్యాటకులు రాష్ట్రానికి ఎలా వస్తారని ఆయన ప్రశ్నించారు. ఓటు వేసే ముందు అభ్యర్థి నేర చరిత్రను బాగా తెలుసుకోవాలని ఓటు వేయడం వల్ల రాష్ట్రానికి ఏమైనా ప్రయోజనం ఉందో లేదో కూడా ఆలోచించాలని వాటాళ్ సూచించారు. రాజకీయాలు పూర్తిగా అవినీతి మయంగానూ నేరపూరితంగానూ మారిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. సజ్జనులు, సామాన్యులు ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేదని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికలు ప్రహసనంగా మారిపోతే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత నీరుగారుతుందని ఆయన హెచ్చరించారు.



మీడియాతో మాట్లాడుతున్న వాటాళ్‌నాగరాజ్

కేఆర్ఎస్, ఆర్‌పీఐ అభ్యర్థుల జాబితా విడుదల

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర సమితి (కేఆర్ఎస్) రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా- అంబేడ్కర్ పార్టీలు లోక్‌సభకు పోటీ చేసే తమ పార్టీల అభ్యర్థుల జాబితాలను నగరంలో బుధవారం ప్రకటించాయి. కేఆర్ఎస్ ఇంతవరకు 16 నియోజకవర్గాలకు తన అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. వీరిలో బెంగళూరు సెంట్రల్ నుంచి కె.ప్రకాష్, బెంగళూరు నార్త్ నుంచి బి.శివకుమార్, కోలార్ నుండి ఏవీమహేష్, బెంగళూరు దక్షిణ నుంచి రఘుపతి భట్ పోటీచేయనున్నట్లు పార్టీ నగరంలో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. తొలి దశలో ఆరుగురు, రెండో జాబితాలో 10మంది పేర్లను ప్రకటించామని మిగిలిన వారి పేర్లను కూడా త్వరలోనే ప్రకటిస్తామని ప్రకటనలో పేర్కొన్నారు. కాగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా- అంబేడ్కర్ పార్టీ కూడా 10 మంది అభ్యర్థులతో జాబితాను విడుదల చేసింది. పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మహేష్ గోరనాళ్కర్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్- బీజేపీలు ఒకే నాణేనికి రెండు ముఖాలని విరుచుకుపడ్డారు. తమ పార్టీతరుఫున బెంగళూరు నార్త్‌నుంచి హెబ్బాళ్ వెంకటేష్, బెంగళూరు సెంట్రల్ నుండి వెంకటేష్ ప్రసాద్, కోలార్ నుండి ఎన్‌జే.నరసింహమూర్తి పోటీచేస్తారని తెలిపారు.

తాగునీటి సమస్యపై రేపు చర్చాగోష్ఠి

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నెల- జల సంరక్షణా సమితి ఆధ్వర్యంలో నగరంలోని శివానంద సర్కిల్ సమీపాన గల గాంధీ స్మారక ట్రస్టు ఆవరణలో ఈ నెల 23న ప్రత్యేక చర్చాగోష్ఠిని నిర్వహించనున్నారు. రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కూడా అయిన కర్ణాటక నెల జల సంరక్షణా సమితి అధ్యక్షుడు కురుబూరు శాంతకుమార్ తొలుత తాగునీటి సమస్య తీవ్రత అందుకు కారణాలు అనే అంశంపై ప్రసంగించనున్నారు. బెంగళూరు జలమండలి అధ్యక్షుడు డా. వి.రామప్రసాద్ మనోహర్ సదస్సును ప్రారంభించనున్నారు. గాంధీ స్మారక ట్రస్టు అధ్యక్షుడు వుడే పి.కృష్ణ అధ్యక్షత వహిస్తారు. ఈ సదస్సులో పర్యావరణ నిపుణుడు డా.టి.వి.రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే డా.ముఖ్యమంత్రి చంద్రు, కర్ణాటక రాజ్య రైత సంఘం అధ్యక్షుడు నారాయణరెడ్డి, హోటల్ యజమానుల సంఘం అధ్యక్షుడు పిసి.రావ్, ఐటి కంపెనీనల సంఘానికి చెందిన ఆనంద్‌రావ్, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కర్ణాటక శాఖ అధ్యక్షుడు బాబు రెడ్డి, బెంగళూరు అపార్ట్‌మెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు విక్రంరై, కన్నడ చళవళి కేంద్ర సమితి అధ్యక్షుడు గురుదేవ్ నారాయణకుమార్, విద్యానిపుణుడు డా.నిరంజన్ ఆరాధ్య, సమతా సైనిక దళకు చెందిన డా.వెంకటస్వామి తదితరులు ప్రసంగిస్తారని గురువారం విడుదలైన ప్రకటనలో పేర్కొన్నారు.

టైంపాస్ కావడం లేదు.. అందుకే లోక్‌సభ టిక్కెట్ అడిగారు..

● సుధాకర్‌పై బీజేపీ ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ ఆగ్రహం

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికలలో ఓడిన తర్వాత డాక్టర్ సుధాకర్‌కు టైంపాస్ కావడం లేదని అందుకే చిక్కబళ్ళాపుర టికెట్ అడిగారంటూ యలహంక బీజేపీ ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ మండిపడ్డారు. ఢిల్లీలో బీజేపీ నేత యడియూరప్పను కలిసిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ చిక్కబళ్ళాపుర ఎంపీ బచ్చేగౌడ ఇకపై పోటీ చేసేది లేదని ప్రకటించిన వేళ అభ్యర్థి ఎవరూ లేరన్నారు. ముఖ్యనేతలంతా కలిసి నా కుమారుడు అలోక్ విశ్వనాథ్‌ను పోటీ చేయించాలని కోరారన్నారు. దీంతో మేం అన్ని విధాల సిద్ధం చేసుకున్నామన్నారు. ఇంతలోనే మాజీ మంత్రి సుధాకర్ తెరపైకి వచ్చారన్నారు. ఎమ్మెల్యేగా ఓడిన తర్వాత మరో నాలుగేళ్ళు ఇక్కడ ఏం చేయాలని టైంపాస్ కావడం లేదని అందుకే లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేస్తున్నట్లు నాతోనే చెప్పారన్నారు. మేం పార్టీ కోసమే కట్టుబడి ఉన్నామన్నారు. ఢిల్లీ నేతలు ఎవరినీ కలువలేదని యడియూరప్పతో కలిసి వచ్చానన్నారు. అలోక్ నా కుమారుడు అని చెప్పేందుకంటే నియోజకవర్గంలో ఎంతో పనిచేశారన్నారు. న్యూయార్క్‌లో డిగ్రీ పూర్తి చేశారని లండన్‌లో 50 దేశాల పాలనలపై అధ్యయనం చేశారన్నారు. రాజకీయాలకు వస్తే పార్టీతో పాటు సమాజానికి అనుకూలం కానుందన్నారు. సర్వేలలోను అలోక్ పేరు వచ్చిందని సుధాకర్ తొలుత లోక్‌సభకు పోటీ చేయాలని ఆలోచించలేదన్నారు. సుధాకర్ సిద్ధంగా లేనందుకే మేం పోటీ విషయమై కసరత్తు చేశామన్నారు. అలోక్‌కు టికెట్ ఇస్తే రెండుదశాబ్దాలకు పైగా తిరుగుండదన్నారు. యలహంక నుంచి భారీ మెజారిటీ సాధ్యం కానుందని మోదీ వర్చస్సుతో పాటు ప్రజల మద్దతు ఉండేవారే అభ్యర్థి కావాలన్నారు.



శ్యాంసంగ్‌చే రెండు కొత్త మోడల్ ఫోన్‌లు..

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నాణ్యతకు మారుపేరుగా పేరొందిన శ్యాంసంగ్ కంపెనీ మరో రెండు కొత్త మోడల్ ఫోన్‌లను లాంఛనంగా బెంగళూరు మార్కెట్‌లోకి విడుదల చేసింది. గురువారం నగరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గ్యాలెక్సీ ఎ55- 5జీ, ఎ35- 5జీ మోడల్ ఫోన్‌లను సీనియర్ డైరెక్టర్ గుప్రాన్ అలాం హెడ్ విడుదల చేశారు. ఇదే సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యాంసంగ్ ప్రతి మోడల్‌లోను ప్రత్యేకతను పాటిస్తోందన్నారు. మొబైల్‌ఫోన్‌లు కేవలంలో యువతతో పాటు అన్ని వర్గాలు అత్యధిక ఫీచర్లను వాడుతున్నారని అందరికీ అనుకూలమనే రీతిలో రూపొందించామన్నారు. నీళ్ళలో పడినా, నేలపై పడినా మొబైల్ సాధారణంగానే పనిచేయనుందని ప్రయోగాత్మకంగా నేలకేసి కొట్టి చూపారు. నీళ్ళలో వేసినా పనిచేస్తుందని చూపారు. గొరిల్లా గ్లాస్ విక్టస్‌తో పాటు రక్షణ, ఆర్టిఫిషియల్ టెక్నాలజీలకు అనుగుణమైన కెమెరా, ట్యాంపర్ భద్రత, శ్యాంసంగ్ నాక్స్ వాల్ట్ వంటి ప్రత్యేకతలు కలిగి ఉన్నాయన్నారు.6.6 అంగుళాలు కలిగిందని లిథీయిం బ్యాటరీ కనీసం రెండురోజులు బ్యాకప్ ఉంటుందన్నారు. గ్యాలెక్సీ ఎ55 మోడల్స్‌లో 8జీబీ ప్లస్ 126, 12జీబీ ప్లస్ 256 జీబీ వేరియంట్‌లకు36999 - 429999ల దాకాను గ్యాలెక్సీ ఎ35 మోడల్‌లో 8జీబీ 128, 256 జీబీల సామర్థ్యం కాగా రూ.27999-30999లుగా ఉందన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లలోను షోరూంలలోను అందుబాటులో వస్తాయన్నారు.

కుమారస్వామికి ఆపరేషన్ విజయవంతం

● విశ్రాంతి తర్వాత ప్రచారాలకు..



చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుమారస్వామి

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గుండెకు సంబంధిత సమస్యతో బాధపడుతున్న జేడీఎస్ కీలకనేత, మాజీ సీఎం కుమారస్వామికి చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ జరిగింది. నాలుగు రోజుల కిందట కుమారస్వామి ఆసుపత్రిలో చేరారు. కుమారస్వామికి ఆపరేషన్ చేసేందుకు విదేశాల నుంచి నిపుణులైన వైద్యులు వచ్చినట్లు సమాచారం. ఇదే విషయాన్ని సోషల్ మీడియా ద్వారా పోస్టు చేశారు. ఆపరేషన్ తర్వాత కుమారస్వామి కోలుకుంటున్నారని పోస్టు చేశారు. వైద్యనిపుణులు సలహా మేరకు కొన్నిరోజుల పాటు విశ్రాంతి తీసుకుంటారని కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం. ఆపరేషన్ విజయవంతమైందని ప్రస్తుతం సాధారణ పరిస్థితికి చేరుకుంటున్నారన్నారు. విశ్రాంతి తర్వాత కుమారస్వామి రాజకీయ ప్రచారాలలో పాల్గొననున్నారు. చెన్నైకు వెళ్ళే ముందు కుమారస్వామి మీడియాతో మాట్లాడుతూ ఆసుపత్రికి వెళుతున్నానని కోలుకుని వచ్చిన వెంటనే రాజకీయాలలో పాల్గొంటానని చెప్పిన విషయం తెలిసిందే. బీజేపీతో పొత్తులో భాగంగా హాసన్, మండ్య, కోలార్ నియోజకవర్గాలు కోరామని ఇంకా కోలార్ విషయాన్న తేల్చలేదని చెప్పిన విషయం తెలిసిందే. కాగా కుమారస్వామి మరో వారం రోజుల పాటు విశ్రాంతిలోనే గడపనున్నట్లు సమాచారం.

హైకోర్టు న్యాయమూర్తిగా అను శివరామన్ బాధ్యతలు

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తిగా అను శివరామన్ బాధ్యతలు చేపట్టారు. గురువారం రాజభవన్‌లోని గ్లాస్‌హౌస్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ న్యాయమూర్తి అనుశివరామన్ చేత ప్రమాణం చేయించారు. సీఎం సిద్దరామయ్య, న్యాయశాఖా మంత్రి హెచ్‌కే పాటిల్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిలయ్ విపిన్ చంద్ర అజారియా ప్రభుత్వముఖ్య కార్యదర్శి రజనీష్ గోయల్‌తో పాటు హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు. న్యాయమూర్తిగా ప్రమాణం చేసిన అను శివరామన్‌ను గవర్నర్, సీఎంలు సహా పలువురు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.



హైకోర్టు న్యాయమూర్తి అనుశివరామన్‌ను అభినందిస్తున్న గవర్నర్

ప్రోటాన్ బీమ్ థెరపీపై శిక్షణ

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రోటాన్ బీమ్ థెరపీ విభాగంలో అతిపెద్ద కేంద్రంగా కొనసాగుతున్న అపోలో ప్రోటాన్ క్యాన్సర్ సెంటర్(ఎపీసీసీ)లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆంకాలజిస్టులకు శిక్షణలు ఇవ్వదలచినట్లు అపోలో ఆసుపత్రుల వైస్‌చైర్మన్ ప్రీతారెడ్డి ప్రకటించారు. ఈమేరకు గురువారం ఆమె పేరిట ఒక ప్రకటన విడుదల చేశారు. ఇండోనేషియా, వియట్నాంకు చెందిన ఆంకాలజిస్టులకు శిక్షణలు పూర్తి కాగా త్వరలోనే కజికిస్తాన్, మలేషియా, స్లోవేనియా, ఫిలిప్పైన్స్ దేశాల వైద్యులకు శిక్షణలు ఉంటాయని ప్రీతారెడ్డి ప్రకటించారు. అపోలో ప్రోటాన్ కేన్సర్ సెంటర్‌ను భారత్‌లోని బెల్జియం రాయబారి డిడియర్ వాండ్‌హాస్సెల్ట్ సందర్శించారన్నారు. ఇప్పటి దాకా ఎపీసీసీలో 1400ల మందికి చికిత్సలు అందించామని పదేళ్ళ బాలుడికి చికత్సలు విజయవంతమైనాయన్నారు. వియట్నాంకు చెందిన ఛో రే ఆసుపత్రి ఆంకాలజిస్టు న్గుయెన్ థీ మిన్హ్ హ్యా అభిప్రాయం మేరకు అపోలో క్యాన్సర్ సెంటర్‌లో శిక్షణలు పొందడం ద్వారా మా దేశంలో మరింత మందికి సులభతర చికిత్సలు చేస్తామనే విశ్వాసం కలిగిందన్నారు. ఇండోనేషియాకు చెందిన ధర్మిస్ నేషనల్ క్యాన్సర్ సెంటర్ హెచ్‌ఓడిఓ ఫెబ్రియానో బసుకి రహర్జో అభిప్రాయం మేరకు శిక్షణల ద్వారా మరింత అవగాహన పొందామని మా దేశంలో ఆరోగ్య రంగంలో మార్పులకు ప్రయత్నిస్తానన్నారు.

సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆలయాలు

●ఇస్కాన్ గోవర్ధన విభాగం డైరెక్టర్ గౌరంగదాస్ ప్రభు



ఆలయాలపై జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఇస్కాన్ ముఖ్యులు గౌరంగదాస్

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆలయాలు సమాజంలో కీలక భూమికను పోషిస్తున్నాయని ఇస్కాన్ గోవర్ధన విభాగం డైరెక్టర్ గౌరంగదాస్ ప్రభు అభిప్రాయపడ్డారు. చాణక్య యూనివర్శిటీలో ఆలయాల నిర్వహణ చారిత్రాత్మక, క్రియాశీలక భవిష్యత్తు దృష్ట్యా అనే అంశంపై చర్చాగోష్ఠి జరిగింది. గౌరంగ్ దాస్ ప్రభూజీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మానవుడు నిర్ధారించే సామర్థ్యాన్ని కోల్పోయే దశకు చేరిందని విచారం వ్యక్తం చేశారు. ఇదే తరుణంలోనే ఆలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలుగానే కాకుండా వైద్యకేంద్రాలుగా పనిచేస్తున్నాయన్నారు. ఆలయంలోకి ప్రవేశించినన వెంటనే వ్యక్తి కొత్త ఆలోచన, శక్తితో ఆతడి ముఖంలో మార్పు చోటుచేసుకుంటుందన్నారు. అప్పటిదాకా ఉండే ఒత్తిడి నుంచి కూడా ఉపశమనం పొందుతారన్నారు. దేవాలయాలు సమాజంలో ముఖ్య భూమికను పోషిస్తున్నాయని వాటిని సాంస్కృతికంగాను చారిత్రాత్మకంగాను నిర్వహించేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయాల నిర్వహణకు సంబంధించి సవాళ్ళు, అవకాశాలు, వాటి రక్షణతో పాటు అభివృద్ధికి అందరి భాగస్వామ్యులను చేయాల్సి ఉందన్నారు. కొత్త అంశాల పరిశోధనలో చాణక్య యూనివర్శిటీ ముందంజలో ఉందన్నారు. నాల్గవ అంతర్జాతీయ సమ్మేళనం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సమాజంలో అన్ని అంశాలపైనా పరిశోధనలు జరగాల్సి ఉందన్నారు. చాణక్య యూనివర్శిటీ వైస్‌ఛాన్స్‌లర్ యశవంత డొంగ్రే, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారులు ప్రొఫెసర్ కేవి రాజు తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా తమ్మేశ్‌గౌడ

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా బెంగళూరు ఉత్తర ప్రాంతానికి చెందిన తమ్మేశ్‌గౌడను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు బివై.విజయేంద్ర ప్రకటన విడుదల చేశారు. కాగా బీజేపీ లోక్‌సభ ఎన్నికల నిర్వహణా కమిటి సభ్యులుగా విధానపరిషత్‌లో చీఫ్‌విప్ ఎన్.రవికుమార్, ఎమ్మెల్సీలు భారతి శెట్టి, ఎస్.కేశవ్ ప్రసాద్‌లను నియమించారు. కమిటీ అధ్యక్షునిగా పార్టీ ఎమ్మెల్యే వి.సునీల్ కుమార్ ఇటీవల నియమితులైన సంగతి విదితమే.

ప్రముఖ పారిశ్రామికవేత్త ధరంపాల్ మృతికి వివాళి

పావగడ, మార్చి 21: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త జీఎస్ ధరంపాల్(92) గురువారం అర్ధరాత్రి మృతి చెందారు. ధరంపాల్ చివరి వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ, పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని మాజీ మంత్రి వెంకటరమణప్ప అన్నారు. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి, తాలూకాకు తీరని లోటని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ అన్నారు. ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాలూకాలోని అన్ని పార్టీలకు చెందిన నాయకులు ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు.

నోటి పరిశుభ్రతపై అవగాహన

గోరంట్ల, మార్చి 21: ప్రతిఒక్కరు నోటిని, దంతాలను శుభ్రం చేసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ దంత వైద్యుడు డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. ప్రపంచ ఓర్ హెల్త్ డే సందర్భంగా గురువారం గోరంట్లలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్దనుంచి ప్రధాన రహదారిపై వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లా డుతూ... నోరు, దంతాల శుభ్రతవలన క్యాన్సర్‌లాంటి వ్యాధులు ధరి చేరవని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలున్నారు.

వినూత్నంగా రూపు దిద్దుకుంటున్న 'స్విచ్'


బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యావంతులైన వర్ధమాన నటీనటులతో రూపుదిద్దుకుంటున్న 'స్విచ్' సినిమా టైటిల్ టెక్కీలు తరచుగా వాడే పదం. ఈ సినిమా ట్రేలర్, ర్యాప్‌సాంగ్ విడుదల కార్యక్రమం నగరంలోని రేణుకాంబ స్టూడియోలో ఘనంగా జరిగింది. ఈ సినిమా యూనిట్‌లో అత్యధికులు ఇంజనీర్లు కావడం మరో విశేషం. చేతన్ శెట్టి చిత్ర కధను అందించి దర్శకత్వం వహిస్తున్నారు. నిజ జీవితంలో జరిగే కొన్ని సంఘటనలకు హాస్యాన్ని జోడించి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు దర్శకుడు చేతన్ శెట్టి గురువారం మీడియాకు చెప్పారు. కొండాణ ఫిలింస్ పతాకంపై బేబి ఎన్. శెట్టి, కెమంత్ పి.రెడ్డి, సుధాంశు శంకర్‌లు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మహేష్ డోంతిరెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సామాన్యంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఒక కంపెనీ నుండి మరో కంపెనీకి వెళ్ళే సమయంలో స్విచ్ అనే పదాన్ని వాడుతుంటారు. ఈ సినిమాలో విజయ్ సూర్య హీరోగానూ, శ్వేతా విజయ్‌కుమార్ హీరోయిన్‌గానూ నటిస్తున్నారు. ఇతర ప్రధానపాత్రలను బలరాజవాడి, సంతోష్ కార్కి, పృథ్వీరాజ్, కార్తిక్ వైభవ్, విజయ్ సిద్ధరాజు పోషిస్తున్నారు. భృత్వశ్యాలేట్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమాకథ ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చుట్టూ తిరుగుతుంది. సహజత్వంకోసం సాఫ్ట్‌వేర్ కంపెనీలోనే చిత్రీకరణ జరిపామని దర్శకుడు వెల్లడించారు. ప్రస్తుతం ఈ సినిమాకు కలర్ గ్రేడింగ్ జోరుగా సాగుతోంది. త్వరలోనే సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు దర్శకుడు చేతన్ శెట్టి ప్రకటించారు.

చిత్రజ్యోతి



చిత్ర యూనిట్

ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ అభ్యర్థి భేటీ



భేటీలో పాల్గొన్న నేతలు

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తుమకూరు లోక్‌సభా నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఎస్పీ ముద్దేహనుమేగౌడ నగరంలో గురువారం విజయనగర ఎమ్మెల్యే ఎం.కృష్ణప్ప, గోవిందరాజనగర ఎమ్మెల్యే ప్రియా కృష్ణలతో భేటీ అయ్యారు. ఉభయ నేతలతోనూ కొద్దిసేపు చర్చలు జరిపారు. తనకు మద్దతునివ్వాలని ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాలపంచుకోవాలని ముద్దేహనుమేగౌడ వారికి విజ్ఞప్తిచేయగా వారు సానుకూలంగా స్పందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను భేటీ అయ్యారు. తుమకూరులో పెద్ద సంఖ్యలో ఉన్న ఒక్కలిగ ఓటర్లను ఆకట్టుకునే దిశలో ముద్దేహనుమేగౌడ రాజకీయ వ్యూహాలను రూపొందించడంలో తలమునకలై ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

హిందూపురం, మార్చి 21 : కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హిందూపురం పట్టణ పరిధిలో ని పోచనపల్లివద్ద సెబ్ అధికారులు గురువారం వాహ నాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి ఓ వ్యక్తి 12 బాక్సుల కర్ణాటక మద్యం తీసుకొస్తుండగా తనిఖీల్లో సెబ్ పోలీసుల పట్టుబడింది. ఈ మద్యాన్ని అతడు హిందూపురంలో డోర్ డెలివరీ చేస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా టూటౌన్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా తొమ్మిది బాక్సుల మద్యం పట్టుబడింది.

లేపాక్షి : కర్ణాటక రాష్ట్రం నుంచి ఆంధ్రకు అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. మండలంలోని మామిడిమాకులపల్లి వద్ద గురువారం తెల్లవా రుజామున 4గంటల సమయంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన వ్యక్తి అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడివద్ద నుంచి 192మద్యం బాటిళ్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతడిపై గతంలో పలు మార్లు కేసులు నమోదుచేసి అరెస్టైచేసినట్లు తెలిసింది. ఇప్పుడు కూడా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మామిడి చెట్లకు నిప్పు

● ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టారన్న బాధితుడు

హిందూపురం, మార్చి 21: మండలకేంద్రమైన పరి గి వద్ద పచ్చని మా మిడి చెట్లకు నిప్పు పెట్టారని పరిగికి చెం దిన బీజేపీ మండల కన్వీనర్ భద్రీనాథ్ వాపోయాడు. ఆయన తండ్రి శ్రీరాములు 14 ఏళ్ల కిందట శ్రీరంగరాజు ప ల్లికి వెళ్లే రహదారి పక్కన పరిగి చెరువుకు ఆనుకొని సర్వేనంబర్ 356-5-సీ లోని 3.52 ఎకరాలను కొనుగోలు చేశాడు. ఈ పొలంలో 220 మామిడి చెట్లు, వంద టెంకాయ చెట్లు నాటారు. అయితే గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మామిడి చెట్లకు నిప్పు పెట్టారని భద్రీనాథ్ పేర్కొన్నారు. ఇది పక్క పొలం వారు చూసి భద్రీనాథ్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన అక్కడికి చేరుకునే లోగా 24 మామిడి చెట్లు, రెండు టెంకాయ చెట్లు, ఒక చింత చెట్టు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ప్రస్తుతం మామిడి చెట్లు కాయల దశకు వచ్చాయని, పలు చెట్లలో కాయలు కూడా పూర్తిగా కాలిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై భద్రీనాథ్ మాట్లాడు తూ... తమకు ఎవరూ శత్రువులు లేరన్నారు. అయితే ఎవరో కావాలనే ఉద్దేశ్య పూర్వకంగా నిప్పు పెట్టారని అన్నారు. భద్రీనాథ్ వైసీపీలో ఉంటూ కొంత కాలం క్రితం బీజేపీలో చేరారు. దాంతో అధికార పార్టీ వారే ఈ పని చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



కాలిపోయిన మామిడి చెట్లు

గడ్డివాములకు నిప్పు

గోరంట్ల, మార్చి 21: మండలంలోని శిరగంవాండ్లప ల్లిలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు గడ్డి వాములు కాలిపోయాయి. దీంతో రూ. 50వేలు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు వాపోతున్నారు. శిరగంవాం డ్లపల్లికి చెందిన బోయ గంగరత్నమ్మ పశువుల మేత కోసం బండి వరిగడ్డి, నాలుగు బండ్ల మొక్కజొన్న చొప్ప ను కొనుగోలు చేసి వామి వేసుకుంది. అలాగే వెంకట శివారెడ్డి రెండు ట్రాక్టర్ల వరి గడ్డిని నిలువ చేసుకున్నాడు. అయితే గుర్తు తెలియనివారు గురువారం తెల్లవారు జామున నిప్పు పెట్టడంతో ఆ వాములు కాలిబూడిద య్యాయని బాధితులు తెలిపారు. గ్రామస్థులు మంటలు ఆర్పడానికి ప్రయత్నం చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది పుట్టపర్తి నుంచి యంత్రంతో వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. అగ్నిమాపక యంత్రం రానిపక్షంలో పక్కనే ఉన్న హనుమంతురెడ్డికి చెందిన్న మొక్కజొన్న గడ్డివామి, రెండెకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న రామక్రిష్ణరెడ్డికి చెందిన మొక్కజొన్నపంట కాలిపోయి తీవ్ర నష్టం జరిగేదని గ్రామస్థులు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులుకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

క్రికెట్ బ్యాట్లు సీజ్

చిలమత్తూరు, మార్చి 21: సరైన పత్రాలు లేని కారణంగా బెంగ ళూరు నుంచి ఉత్తర ప్రదేశ్‌కు తీసుకెళు తున్న వంద క్రికెట్ బ్యాట్లను పోలీసులు సీజ్ చేసినట్లు ఎస్ ఐ గంగాధర్ గురు వారం తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కి చెందిసన అకాష్ సింగ్ తన వాహనంలో వంద క్రికెట్ బ్యాట్లను తీసుకెళుతుండగా కొడికొండ చెక్‌పోస్టులో చేపడుతున్న పోలీసుల తనిఖీలో పట్టుబడ్డాయన్నారు. సంబంధిత క్రికెట్ బ్యాట్లకు సరైన పత్రాలు అతడి వద్ద లేకపోవడంతో వాటిని సీజ్ చేశామన్నారు. నాగపూర్‌లో జరుగుతున్న ఓ క్రికెట్ టోర్నమెంట్ కోసం ఈ బ్యాట్లు తీసుకెళుతున్నట్లు ఆకాష్ సింగ్ తెలిపాడన్నారు. స్వాధీనం చేసుకున్న బ్యాట్లతో పాటు వాహనాన్ని హిందూపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్దకు పంపామని ఎస్ఐ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న క్రికెట్ బ్యాట్లు, వాహనం